

మందమర్రిరూరల్: అంగడిబజార్ ఏరియాలోని శివాలయంలో..



చెన్నూర్ శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

'కార్తీక' పూజలు

చెన్నూర్/మందమర్రిరూరల్/చెన్నూర్‌రూరల్/బెల్లంపల్లిరూరల్/శ్రీరాంపూర్/తాండూర్/కాసిపేట: కార్తీకపౌర్ణమి వేడుకలను జిల్లాప్రజలు సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం నుంచి భక్తులు ఆలయాలకు తరలివచ్చి పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు, యువతులు దీపాలు వెలిగించారు. అధికసంఖ్యలో తరలివచ్చిన భక్తులతో ఆలయప్రాంగణాలు సందడిగా మారాయి. బెల్లంపల్లి మండలం కన్నాల పరిధిలో గల శ్రీ బుగ్గ రాజేశ్వరస్వామి ఆలయంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పూజలు చేశారు. బెల్లంపల్లి మండలం చంద్రవెల్లిలో శ్రీ అన్నపూర్ణ సహిత సోమేశ్వర ఆలయం, తాండూర్‌లోని ఐబీ శ్రీ భక్తాంజనేయ ఆలయం, శ్రీరాంపూర్‌లోని కృష్ణ కాలనీ గీతా మందిర్‌లో సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. మహిళలు పాల్గొని నోముకున్నారు. అనంతరం అన్నదానం చేపట్టారు.



చెన్నూర్‌లో దీపాలు వెలిగిస్తూ..



బెల్లంపల్లిరూరల్: పూజలు చేస్తున్న ఎమ్మెల్యే



చెన్నూర్‌రూరల్: ఒతుకులపల్లిలో అభయాంజనేయ స్వామి ఆలయంలో..



బెల్లంపల్లిరూరల్: వ్రతం నిర్వహిస్తున్న భక్తులు



తాండూర్: సత్యనారాయణ వ్రతంలో పాల్గొన్న భక్తులు



శ్రీరాంపూర్: వ్రతాలు నిర్వహిస్తున్న దంపతులు

పీఎస్సార్‌కు జననీరాజనం

- అడుగడుగున ఘన స్వాగతం

దండేపల్లి: అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంచిర్యాల కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొక్కిరాల ప్రేంసాగర్‌రావు దండేపల్లి మండలం తాళ్లపేట నుంచి హాజీపూర్ మండలం వేంపల్లి వరకు సోమవారం రోడ్‌షో నిర్వహించారు. మండల ప్రజలు, భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, అభిమానులు, ప్రేంసాగర్‌రావు దంపతులకు ఘన స్వాగతం పలికారు. మేదరిపేటలో గజమాలతో సత్కరించి స్వాగతం చెప్పారు. రోడ్‌షోకు వచ్చిన ప్రజలను ఉద్దేశించి ప్రేంసాగర్‌రావు మాట్లాడుతూ అధికారంలో ఉన్న లేకున్నా నియోజకవర్గ ప్రజలకు గత కొన్నేళ్లుగా సేవ చేస్తున్నాను, ఈసారి ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ చేతిగుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ మాట్లాడుతూ కొంగు చాచి అడుగుతున్నా..ప్రతి ఒక్కరూ చేతిగుర్తుకు ఓటేసీ ప్రేంసాగర్ రావును భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు ఉన్నారు. కాగా, అసెంబ్లీ బరిలో ఉన్న అభ్యర్థుల ప్రచారంపై ఎన్నికల సిబ్బంది నిఘా పెడుతున్నారు. మంచిర్యాల కాంగ్రెస్ అభ్యర్థి ప్రేంసాగర్‌రావు రోడ్‌షోపై మేదరిపేట సమీపంలో వీడియో చిత్రీకరిస్తుండగా సాక్షి క్లిక్‌మనిపించింది.



మేదరిపేటలో ప్రేంసాగర్‌రావు దంపతులకు గజమాలతో స్వాగతం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): దండేపల్లి, లక్సెట్టిపేటల మీదుగా సాగిన ప్రేంసాగర్‌రావు రోడ్ షో సోమవారం సాయంత్రం హాజీపూర్ మండలానికి చేరుకుంది. హాజీపూర్ శివారులో ఆయనకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా స్వాగతం పలికారు. కాగా దొనబండ నుంచి ప్రారంభమైన రోడ్‌షో హాజీపూర్, రాపల్లి, గుడిపేట, ముల్కల్ల మీదుగా వేంపల్లి గ్రామ శివారులో ముగిసింది. ప్రేంసాగర్‌రావు, డీసీసీ అధ్యక్షురాలు సురేఖ పాల్గొన్న రోడ్ షోకు అడుగడుగునా మహిళలు మంగళహారతులతో స్వాగతం పలకగా అన్ని వర్గాల ప్రజానీకం నీరాజనం పలికారు.

లక్సెట్టిపేట: పట్టణంలో మంచిర్యాల కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొక్కిరాల ప్రేంసాగర్‌రావు సోమవారం రోడ్‌షో నిర్వహించారు. స్థానిక ఎన్టీఆర్ చౌరస్తా నుంచి అంబేద్కర్ చౌరస్తా మీదుగా సూరారం వెళ్లి మంచిర్యాల వరకు రోడ్‌షో చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక చేపట్టే అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు.



లక్సెట్టిపేట రోడ్‌షోలో ప్రేంసాగర్ రావు

బీఆర్‌ఎస్‌తోనే సంక్షేమం, అభివృద్ధి

- మంచిర్యాల బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నడిపెల్లి దివాకర్‌రావు



21వ వార్డులో ఇంటింటా ప్రచారం చేస్తున్న నడిపెల్లి దివాకర్‌రావు



దండేపల్లి: నెల్కివెంకటాపూర్ ప్రచారసభలో దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పడితేనే అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందడంతోపాటు, అభివృద్ధి జరుగుతుందని మంచిర్యాల బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. జిల్లాకేంద్రంలోని 21వ వార్డులో సోమవారం ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

కారుగుర్తుకు ఓటేయాలి

దండేపల్లి: అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ కారుగుర్తుకు ఓటేసి గెలిపించాలని మంచిర్యాల కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి దివాకర్‌రావు కోరారు. మండలంలోని నెల్కివెంకటాపూర్‌లో సోమవారం రాత్రి ఎన్నికల ప్రచార సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమన్నారు. పైగా అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ఇందుకోసం కారుగుర్తుకు ఓటేసి బీఆర్‌ఎస్‌ను మూడోసారి అధికారంలోకి తేవాలన్నారు. ఎవరెన్ని చెప్పిన ప్రజలు నమ్మొద్దని సూచించారు. పీఏసీఎస్ చైర్మన్ లింగన్న, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు సత్తయ్య, తిరుపతి, సురేష్ పాల్గొన్నారు.

ఆశీర్వదించండి.. అభివృద్ధి చేసి చూపిస్తా

- ఖానాపూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి జాన్సన్ నాయక్

జన్నారం: ఈఎన్నికల్లో ఆశీర్వదిస్తే ఖానాపూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని ఖానాపూర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్ అన్నారు. మండలంలోని చింతగూడ, తపాలాపూర్, మహ్మదబాద్, రోటిగూడ, తిమ్మాపూర్, రాంపూర్ గ్రామాల్లో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని వివరించారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తే పింఛన్ల డబ్బులు విడతల వారీగా రూ. 5 వేల వరకు పెంచుతామన్నారు. సిలిండర్‌ను రూ.400కు తగ్గిస్తామని, రైతుబంధు రూ.16 వేల వరకు పెంచనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వినయ్‌కుమార్, బుచ్చన్న, శంకర్, లక్ష్మన్, జాడి గంగాధర్, రవి పాల్గొన్నారు.



జన్నారం: ప్రచారం చేస్తున్న జాన్సన్ నాయక్



ఖానాపూర్: తర్లపాడ్‌లో జాన్సన్‌నాయక్ పూజలు

ఖానాపూర్: కార్తీకపౌర్ణమి పురస్కరించుకొని పట్టణంలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంతోపాటు తర్లపాడ్ గ్రామంలోని ఓంకారేశ్వర ఆలయాల్లో ఖానాపూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి జాన్సన్‌నాయక్ ప్రత్యేక పూజలు చేశారు.వారి వెంట పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యేగా జాన్సన్‌నాయక్‌ను గెలిపించాలని బీఆర్‌ఎస్ నాయకులు పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటా తిరుగుతూ ఈవీఎంలపై ఓటు వేసే విధానంపనై అవగాహన కల్పించారు.

గల్ఫ్ కార్మికులకు ఆర్థికసాయం

జన్నారం: మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన కొత్తకొండ బాలు, పాలగాని రామన్న అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సంఘం రాంపూర్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం రూ.55,300 ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కల్లెడ భూమయ్య మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం గల్ఫ్ బోర్డు ఏర్పాటు చేసి, ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన కార్మికులను ఆదుకోవాలని కోరారు. వారివెంట గ్రామ కమిటీ సభ్యులు నరేశ్, రామన్న, నాగన్న తదితరులు ఉన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న సంఘ నాయకులు

ఉచిత టీబీ నిర్ధారణ పరీక్షలు

మందమర్రిరూరల్: పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలోని పీహెచ్‌సీలో సోమవారం మొబైల్ వ్యాన్ ద్వారా ఉచిత టీబీ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. పలు ఏరియాలతోపాటు, గ్రామాల నుంచి టీబీ అనుమానితులు 102 మందికి వైద్య పరీక్షలు చేసినట్లు డాక్టర్ రమేశ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీబీ వ్యాధిగ్రస్తులకు ఉచిత మందులతోపాటు చికిత్స పూర్తయ్యేవరకు వారికి ప్రభుత్వం పోషణ భత్యం కింద నెలకు రూ. 500 అందిస్తోందన్నారు. సీహెచ్‌వో గంగాధర్, జిల్లా టీబీ సూపర్‌వైజర్ నాగభూషణం, సిబ్బంది, ఆశవర్కర్లు తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

మందమర్రిరూరల్: పట్టణంలోని ఇందుగార్డెన్‌లో అఖిల భారతయాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకుడు బండి సదానందం ఆధ్వర్యంలో సోమవారం సుమారు వందమంది కాంగ్రెస్‌లో చేరారు. హస్తం గుర్తుకు ఓటేస్తామని నాయకులు స్వచ్ఛందంగా ప్రతిజ్ఞ చేశారు. యాదవ సంఘం నాయకులు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

'దోపిడీ పాలకవర్గ పార్టీలను ఓడించండి'

మంచిర్యాలఅర్బన్: శాసనసభ ఎన్నికల్లో విద్యార్థులు, నిరుద్యోగులను మోసం చేసిన దోపిడీ పాలక వర్గ పార్టీలను ఓడించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ పిలుపునిచ్చారు. మంచిర్యాల సీపీఐ న్యూడెమోక్రసీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పదేళ్లలో ప్రభుత్వాలు విద్య, వైద్య, ఉపాధి రంగంపై చిన్నచూపు చూశాయన్నారు. తెలంగాణలో లక్ష ఉద్యోగాలని చెప్పి ఉన్న ఉద్యోగాలను రాష్ట్రప్రభుత్వం ఊడగొట్టిందని ఆరోపించారు. విద్యార్థులు, నిరుద్యోగులు ఓటు ద్వారా ఆ పార్టీలకు బుద్ధి చెప్పాలన్నారు. మంచిర్యాల నుంచి న్యూడెమోక్రసీ బలపరుస్తున్న అభ్యర్థి అందె మంగను గెలిపించాలని కోరారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

జన్నారం: మండలంలోని కవ్వాల్ గ్రామంలో సోమవారం డీఆర్‌డీఏ, ఐకేపీల ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఐకేపీ ఏపీఎం బుచ్చన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రం వద్ద రైతులకు ఇబ్బంది లేకుండా సౌకర్యాలు కల్పించాలని సూచించారు. గ్రామ సంఘం అధ్యక్షురాలు పుష్పలత, సీసీ సునీత, వీఓఏ మల్లయ్య తదితరులు ఉన్నారు.

బీఎస్పీ చీఫ్ రోడ్‌షో రద్దు

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో సోమవారం నిర్వహించిన తలపెట్టిన బీఎస్పీ చీఫ్ ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్ రోడ్‌షో రద్దయింది. సిర్పూర్‌టీ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న ఆర్‌ఎస్‌పీ సమయాభావం కారణంగా రోడ్‌షోకు రాలేదు.

క్లుప్తంగా

ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని ప్రమాణం



పూజలు చేస్తున్న వివేక్

రామకృష్ణాపూర్: కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని చెన్నూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి గడ్డం వివేక్ వెంకటస్వామి ప్రమాణం చేశారు. సోమవారం స్థానిక విజయ గణపతి దేవాలయంలో ప్రత్యేక పూజల అనంతరం గ్యారంటీల అమలుపై ప్రజల సమక్షంలో ప్రమాణం చేశారు. అనంతరం పట్టణంలో ప్రచారాన్ని చేపట్టారు.

బెల్లంపల్లిలో ఉండి ప్రజలకు సేవ చేస్తా



బాండ్ పేపర్ చూపిస్తున్న వినోద్

బెల్లంపల్లి: అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన తర్వాత బెల్లంపల్లిలోనే ఉండి ప్రజలకు సేవ చేస్తానని బెల్లంపల్లి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి గడ్డం వినోద్ తెలిపారు. బెల్లంపల్లి సుభాష్‌నగర్ బస్తీలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు పలు హామీలు ఇస్తూ రాయించిన బాండ్ పేపర్‌ను విడుదల చేశారు. ఆరు గ్యారంటీ స్కీంలను అమలు చేస్తానని తెలిపారు. నాయకులు కె.వి ప్రతాప్, సూరిబాబు, మునిమంద రమేశ్, చిలుముల శంకర్, నాతరి స్వామి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేని శంకర్, నియోజకవర్గ కార్యదర్శి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు రాజీనామా



రియాజొద్దీన్

జన్నారం: జన్నారం ఎంపీటీసీ, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఎండీ రియాజొద్దీన్ బీఆర్‌ఎస్‌కు గుడ్‌బై చెప్పారు. పార్టీలో ప్రాధాన్యత లేకపోవడంతో సోమవారం రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. రాజీనామా పత్రాన్ని జిల్లా అధ్యక్షుడు, మండల అధ్యక్షులకు పంపించినట్లు ఆయన తెలిపారు. ఏ పార్టీలో చేరేది త్వరలో వెల్లడిస్తానని పేర్కొన్నారు.

బారులు తీరిన మందుబాబులు

నెన్నెల: మండల కేంద్రంలోని నెన్నెల వైన్స్ ఎదుట సోమవారం మందుబాబులు బారులుతీరారు. మంగళవారం సాయంత్రం 4 గంటల నుంచి మద్యం షాపులు మూసివేయాలని నిబంధన ఉండటంతో ముందుగానే వరుసలో నిలబడ్డారు. చుట్టుపక్క గ్రామాల నుంచి వచ్చి కొనుగోలు చేశారు. నేడు ఎన్నికల ప్రచారం ముగియనుండటంతో అభ్యర్థుల అనుచరులు మద్యం బాటిళ్లు కొనుగోలు చేసి రహస్యంగా ఉంచినట్లు సమాచారం. మద్యం, డబ్బులు పంచేందుకు పార్టీలు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాయి. ఏది ఏమైనా చుక్క పడితేనే మందుబాబులు ఓటేస్తారని నాయకులు ముందుగానే మద్యం నిల్వలు చేసుకున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది.



'బీజేపీ, బీఆర్‌ఎస్ గెలిస్తే రాజ్యాంగం రద్దు'

మందమర్రిరూరల్: అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్‌ఎస్ గెలిస్తే భారత రాజ్యాంగం రద్దు చేసి మనువాద సిద్ధాంతం అమలు చేస్తాయని భారత్ బచావో కమిటీ రాష్ట్ర నాయకుడు ఒడ్డేపల్లి మనోహర్ ఆరోపించారు. మందమర్రి ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌లు ఒక్కటై చీకటి ఒప్పందం చేసుకున్నాయన్నారు. ఆ పార్టీలకు ఎంఐఎం పార్టీ తోడైందని ఆరోపించారు. భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీలను ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా చైర్మన్ కనుకుంట్ల మల్లయ్య, ప్రధాన కార్యదర్శి ఎండీ ఇబ్రహీం, పట్టణ అధ్యక్షుడు సుంకు లక్ష్మణ్, నాయకులు నీరటి రాజన్న, సమ్ము రాజయ్య, పోలు శ్రీనివాస్, బుంగ సురేందర్, షరీఫ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

కనీస వేతనాలు చెల్లించాలి

శ్రీరాంపూర్: సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం సీఐటీయూ డివిజన్ అధ్యక్షురాలు వేల్పుల కుమారి డిమాండ్ చేశారు. సోమవారం శ్రీరాంపూర్‌లోని సివిల్ కార్యాలయం వద్ద కాంట్రాక్ట్ కార్మికులతో సమావేశమై మాట్లాడారు. తెలంగాణ వ్యాప్తంగా ఉన్న 73 షెడ్యూల్ పరిశ్రమలకు సంబంధించిన ఐదు కనీస వేతనాల జీవోలను 2021 జూన్‌లో విడుదల చేశారన్నారు. కానీ ఆ జీవోలకు సంబంధించిన గెజిట్ విడుదల చేయలేదన్నారు. ఇటీవల హైకోర్టును ఆశ్రయించగా, నవంబర్ 9లోగా వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించినా అమలు చేయలేదన్నారు. దీంతో కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ కార్మికులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. నాయకులు కట్ల కళ, స్వరూప లక్ష్మి, సుజాత పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన కౌన్సిలర్

చెన్నూర్: పట్టణంలోని 6వ వార్డు కౌన్సిలర్ చిలుకమారి శరణ్య సోమవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బాల్కసుమన్ సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు. గత మున్సిపల్ ఎన్నికల్లో శరణ్య స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందింది. కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్‌ఎస్‌లో చేరినట్లు శరణ్య తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నవాజ్, కృష్ణ పాల్గొన్నారు.



గులాబీ కండువా కప్పుకున్న శరణ్య

ట్రాఫిక్ ఇబ్బందులు

దండేపల్లి: కార్తీకపౌర్ణమి జాతర సందర్భంగా సోమవారం గూడెం బస్టాప్ నుంచి గోదావరినది వరకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి. బస్సులు, ఆటోల్లో వచ్చిన భక్తులు గుట్ట వద్ద, గోదావరినది వద్ద వాహనాలు దిగే క్రమంలో నిలిచిపోవడంతో వాహనదారులు ఇక్కట్లుపడ్డారు. ట్రాఫిక్ నియంత్రణలో అధికారులు విఫలమయ్యారని పలువురు ఆరోపించారు.

